క్లుప్తంగా

మోషేనురాజును కలిసిన ముస్లిం పెద్దలు



భీమవరంలో మోషేనురాజును కలిసిన ముస్లీమ్ మత పెద్దలు

భీమవరం: రంజాన్ పర్వదినం సందర్భంగా సోమవారం శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజును భీమవరంలోని క్యాంప్ కార్యాలయంలో ముస్లీం మత పెద్దలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మోషేనురాజు ముస్లిం నేతకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



భీమవరంలో జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం దృశ్యం

భీమవరం: భీమవరం జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. స్థానిక ఛాంబర్ఆఫ్ కామర్స్ భవనంలో అయితా వెంకటకృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులుగా ఏవీఆర్ సభాపతి, ఆర్‌వీ ప్రసాదరావు, ఉపాధ్యక్షుడిగా తుమ్మల పెంట లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శిగా వబిలిశెట్టి ప్రసాదరావు కోశాధికారిగా సన్నిది అచ్యుతరామయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గం 2027 వరకు అధికారంలో ఉంటుంది. అలాగే భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గానికి జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ నుంచి ఏవీఆర్ సభాపతి, గ్రంధి సత్యరవితేజ, ఆర్‌వీ ప్రసాదరావు, టి రంజిత్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

దుర్గమ్మకు మహా కుంభం



అఖండ అన్నసమారాధనలో పాల్గొన్న మహిళలు

ఆకివీడు: స్థానిక జవహర్ పేటలోని దుంపగడప రైల్వే గేటు వద్ద కనక దుర్గమ్మ ఆలయం ఆరోవ వార్షికోత్సవం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయా ప్రాంతాల్లోని భక్తులు మహా కుంభం సమర్పించారు. కావిళ్లతో స్వీట్లు, అన్నం, పసుపు కుంకుమ, గాజులు తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం అఖండ అన్నసమారాధ జరిగింది. అన్నసంతర్పణ కార్యక్రమానికి నగర పంచాయతీ విప్ పడాల శ్రీనివాసరెడ్డి, మోటుపల్లి ప్రసాద్, నొకట్ల రామారావు, రామరాజు, బచ్చు సరళ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పొట్లూరి రాజేష్, ఊడిగ శ్రీనివాస్, రాంబాబు, మంగరాజు, నాగరాజు, వారణాసి శ్రీను, బొమ్మి యశోద కృష్ణ,అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.10 లక్షల ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్ సిబ్బంది

నరసాపురం: పట్టణంలోని 14వ వార్డు గోదావరి గట్టు కొండాలమ్మ గుడి ప్రాంతంలో కారిచర్ల శివ అనే యువకుడు నడుపుతున్న సోఫా తయారీ షాపులో అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదంలో సోఫాల తయారీకి ఉపయోగించే కొబ్బరి పీచు, పలు రకాల ఫోంలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10 గంటల ప్రాంతంలో షాపు తాళం వేసి ఉండగా లోపల నుంచి మంటలు రావడాన్ని గమనించి స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. రెండు ఫైరింజన్లు వచ్చి మంటలు అదుపు చేశాయి. మంటలు పక్కనున్న మరో నివాస భవనానికి కూడా వ్యాపించబోయాయి. అయితే సకాలంలో ఫైరింజన్లు రావడంతో ప్రమాదం తప్పంది. సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం సంభవించిందని అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

అర్హులకు కార్పొరేషన్ రుణాలు ఇవ్వాలి

నరసాపురం రూరల్: అర్హులైన కాపు కాపు సోదరులకు కార్పొరేషన్ ద్వారా రుణాలు అందించాలని వైఎస్ పాలెం మాజీ సర్పంచ్ కూనపరెడ్డి వీరవెంకట విజయరంగారావు అన్నారు. సోమవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడును ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వ ఏర్పాటులో కాపు సామాజిక వర్గం ప్రధాన పాత్ర పోషించిందని రంగారావు పేర్కొన్నారు. రాష్ట్రంలో కాపు సామాజిక వర్గం ఆర్థికంగా వెనుకబడి ఉందన్నారు. కాపుల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదలకు రుణాలు ఇప్పించాలని రంగారావు కొత్తపల్లిని కోరినట్లు తెలిపారు.

అడుగంటుతున్న రక్షిత నీటి చెరువులు

- పలు గ్రామాల్లో పూర్తికాని చెరువుల మరమ్మతులు
- మురుగునీరు సరఫరాతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- కాలువలు కట్టేసమయం ఆసన్నమవుతున్న పట్టించుకోని అధికారులు, కార్యదర్శులు



లోసరిలో అడుగంటిన రక్షిత మంచినీటి చెరువు దృశ్యం



బేతపూడిలో ప్రొక్లెయిన్ సహాయంతో త్రవ్వుతున్న రక్షిత మంచినీటి చెరువు

భీమవరం అర్బన్: మండలంలోని గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు అడుగంటుతున్నాయి. రోజు రోజుకు ఎండలు ముదురు తుండటంతో చెరువులలో తాగునీరు ఆవిరై బురదగా మారుతున్నాయి. ఆ నీటినే కుళాయిల ద్వారా పంచాయతీ అధికారులు సరఫరా చేసి ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వెల్లువెత్తుతున్నాయి. ప్రతి ఏడాది ఏప్రియల్ నెల 15 లోపు పంట కాలువలు కట్టేయడం పరిపాటి. అయితే ఈ ఏడాది ఏప్రిల్ వచ్చినా గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులు పూర్తిగా నింపకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, గొల్లవానితిప్ప, తోకతిప్ప, కొత్తపూసలమర్రు, లోసరి, తుందుర్రు తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరువులలో ఇప్పటికే మొదటి దఫా తాగునీటిని నింపాల్సి ఉండగా ఎక్కడ నింపకపోవడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో తీర ప్రాంత గ్రామాల్లో మంచినీటి చెరువులలో నీటిని నింపినా ఆ నీరు ఉప్పుశాతం పెరిగినా, చెరువు కరకట్టలు గండ్లు పడిపోయిన మళ్లీ వాటిని పూడ్చి నీటిని నింపే సమయం ఉండేది. మరో 15 రోజుల్లో కాలువలు కట్టే సమయం ఆసన్నమైనా ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయం లేకపోవడంతో ఈ ఏడాది నీటికోసం కటకటలాడేల్సిందేనా అని ఆందోళన చేస్తున్నారు. మళ్లీ జూన్ కాలువలకు నీటిని విడుదల చేసినప్పటికీ అవి కలుషితమైన నీరు కావడంతో జూలై నెలాఖరుకు, ఆగష్టు మొదటి వారానికి గాని స్వచ్ఛమైన తాగునీరు ప్రవహించదు. అప్పుడు రక్షిత మంచినీటి చెరువులకు నీటిని నింపుతారు.

కొన్ని గ్రామాల్లో చెరువులు ఇంకా మరమ్మతులు

బేతపూడి, పెదగరువు తదితర గ్రామాల్లో రక్షిత మంచినీటి చెరవులను ప్రొక్లెయిన్ సహాయంతో మరమ్మతులు చేస్తున్నారు. మరో వారమైన ఆ పనులు పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ఈ ఏడాది తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సిందేనా అని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ట్యాంకర్లతో నాగిడిపాలెం, నాగేంద్రపురం తదితర గ్రామాలకు మంచినీటి సరఫరా చేసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. సుమారు మూడు నెలలు పాటు చాలి చాలని నీళ్లతో సరిపెట్టుకోవాల్సిందేనా మదనపడుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

మార్చి మొదటి వారం నుంచి ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖల అధికారులు వేసవికాలాన్ని దృష్టిలో పంచాయతీ కార్యదర్శులను, సర్పంచ్ పాలకవర్గ సభ్యులను అప్రమత్తం చేసి రక్షిత మంచినీటి చెరువులకు తాగునీటిని నింపాల్సి ఉండగా ఈ ఏడాది ఆయా శాఖల సమన్వయ లోపంతో ఇప్పటివరకు నీటిని నింపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు త్వరితగతిన రక్షిత మంచినీటి చెరువులను నింపి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

> **10 లోపు చెరువుల్లో తాగునీటిని నింపాలి**
>
> ఈనెల 10 లోపు రక్షిత మంచినీటి చెరువులలో తాగునీటిని నింపాలని గ్రామాల్లోని అధికారులకు ఆదేశాలే ఇచ్చాం. త్వరితగతిన నింపే విధంగా చర్యలు తీసుకుంటాం.
>
> కనకారావు,ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ

బీసీ బిడ్డను చంపిన వారిని శిక్షించాలి



బడుగు బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకుడు

ఉండి: అధికార మధంతో బీసీ బిడ్డని కొట్టి చంపిన జనసేన రౌడీమూకలను వెంటనే అరెస్టు చేసి శిక్షించాలని వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధికార ప్రతినిధి బడుగు బాలాజీ సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలోని వీరవాసరం మండలం నందమూరు గరువు గ్రామానికి చెందిన మైనర్ బాలుడు అయిన కానాసి రాజేష్ అనే 15 ఏళ్ల బీసీ బిడ్డపై దాడి చేసిన జనసేన పార్టీ గ్రామాధ్యక్షుడు, అతని సోదరుడు మరికొందరు జనసేన రౌడీ మూకలు దారుణంగా దవడలపై కొట్టి, గుండెలపై గుద్దడంతో శ్వాస ఆడక పడిపోయిన బాలుడిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారన్నారు.అతనిని పరీక్షించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు ధ్రువీకరించారన్నారు. ఈ దాడిపై బీసీ సంఘాల ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని తెలిపారు. జనసేన రౌడీమూకలకు బీసీ బిడ్డలు బలైపోతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఈవిషయంపై తగిన చర్యలు తీసుకోవాలని, నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగేలా చూడాలని కోరారు. లేకుంటే బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని బాలజీ హెచ్చరించారు.

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు



ఉగాది సందర్భంగా నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

అత్తిలి: మండలంలోని బల్లిపాడు గ్రామంలో మదనగోపాలస్వామి ఆలయంలో ఉగాది వేడుకలను సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. స్వామివారి కళావేదికపై గ్రామానికి చెందిన మదనగోపాల్ స్కూల్ విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ప్రదర్శించిన జానపద, వెస్ట్రన్, పోక్ డ్యాన్సులతో పాటు కరాటే, కర్రసాము విన్యాసాలు ప్రేక్షకులను అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎల్ లోకనాథ్ శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్, సొసైటీ అధ్యక్షుడు ఎస్ శివకృష్ణ, ప్రిన్సిపాల్ నీలం అనిత, వైస్ ప్రిన్సిపాల్ కుమారి, టి గీతాభారతి, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఆకుల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

భీమవరం: భీమవరం రెండో పట్టణ పరిధి రాయలం సమీపంలో మార్చి 30న జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. తాడేపల్లిగూడేనికి చెందిన పి. భార్గవ కల్యాణ తేజ ద్విచక్రవాహనంపై భీమవరం వచ్చారు. ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలైన తేజను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చారు. ఏఎస్సై ఎన్. వెంకట్రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బలుసులమ్మకు విశేష పూజలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా పట్టణ ఇలవేల్పు బలుసులమ్మ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. వివిధ రకాల పుష్పాలతో, పండ్లతో అమ్మవారికి విశేష అలంకరణలు గావించారు. మహన్యాసపూర్వక పంచామృత సుగంధ ద్రవ్య వివిధ నదీనదజలలాతో విశేష అష్టమూర్తి రుద్రాభిషేకం జరిగింది. రాత్రి దీపోత్సవం నిర్వహించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లు మాకొద్దు



విద్యుత్ స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దంటూ సీపీఎం ముద్రించిన కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: విద్యుత్ స్మార్ట్ మీటర్ మా ఇంటికి వద్దంటూ సీపీఎం ఆధ్వర్యంలో ముద్రించిన స్టిక్కర్స్‌ను సోమవారం భీమవరం సీపీఎం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు బి బలరామ్, జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేసే విధంగా విద్యుత్ స్మార్ట్‌మీటర్స్ బిగించేందుకు రంగం సిద్ధం చేస్తోందని, ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌మీటర్ల కారణంగా ప్రజలపై చార్జీలు పెరిగి పెనుభారంగా మారతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా ఆదానితో చేసుకున్న సెకి విద్యుత్ ఒప్పందం ప్రజలపై విపరీతమైన భారం పడుతుందని ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం ఎన్నికల ప్రచారంలో గగ్గోలు పెట్టిందని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు, యువగళం పాదయాత్రలో లోకేష్ తీవ్రంగా వ్యతిరేకించి స్మార్ట్‌మీటర్లు పగలగొట్టండని పిలుపునిచ్చి అధికారంలోకి వచ్చాక నాలిక మడతవేసి మాట మార్చి విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రతి ఇంటికి బిగించడానికి రంగం సిద్ధం చేయడం దారుణమన్నారు. ఖరీదైన స్మార్ట్ మీటర్ల ఖర్చు కూడా ప్రతి నెల బిల్లులో ప్రజలే భరించాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. వినియోగదారులు ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న సమయంలో యూనిట్ రేట్లు ఎక్కువగా ఉంటుదని వీటివల్ల రైతాంగం, ప్రజలపై పెనుబారాలు పడనున్నాయన్నారు. ప్రజలపై పడుతున్న విద్యుత్ భారాలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నోరుమెదపకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి వాసుదేవరావు, జక్కంశెట్టి సత్యనారాయణ, మామిడిశెట్టి రామాంజనేయులు, మల్లిపూడి ఆంజనేయులు, కె రత్నకుమారి, ఎం.లత తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు

తణుకు అర్బన్: కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కార్మికులకు వ్యతిరేకంగా బడా పెట్టుబడిదారులకు అనుకూలంగా నరేంద్రమోదీ ప్రభుత్వం ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ మే 20వ తేదీన కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరుపతలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని తణుకు ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు పిలుపునిచ్చారు. సోమవారం తణుకు వంక సత్యనారాయణ సురాజ్యభవన్ నందు జరిగిన ఏపీ సీడ్స్ హమాలీ వర్కర్స్ యూనియన్ సమావేశానికి భీమారావు అధ్యక్షత వహించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికులను కట్టు బానిసలను చేయడమే కాకుండా జీవించే హక్కును హరింప చేసే విధంగా ఉన్నాయని స్పష్టం చేశారు. దినానికి 8 గంటల స్థానంలో 10 గంటలు పెట్టడం, యూనియన్‌లు పెట్టుకునే హక్కు నిరాకరించడం, కనీస వేతనాలు అడిగే హక్కు లేకుండా చేయడం లాంటి కార్మిక వ్యతిరేక విధానాలు లేబర్ కోడ్‌ల ద్వారా అమలుకు పూనుకోవడం కార్మిక వర్గానికి తీరని ద్రోహం తలపెట్టడం సరి కాదన్నారు. దేశ వ్యాపిత సార్వత్రిక సమ్మె విజయవంతానికి కృషి చేయాలన్నారు.

నిజాలు నిగ్గు తేల్చాలి



చెరుకువాడలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఉండి: పాస్టర్ ప్రవీణ్ పగడలా మృతిపై రాష్ట్ర ప్రభుత్వం నిజాలు నిగ్గు తేల్చాలని, ఆయన కుటుంబానికి తగిన న్యాయం చేయాలని సీబీసీఎన్‌సీ చర్చ్ చెరుకువాడ చినపేట, పెదపేట ఆధ్వర్యంలో అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీబీసీఎన్‌సీ చెరుకువాడ పేరిష్ అనుబంధ చర్చ్‌ల ఆధ్వర్యంలో గ్రామంలోని చినపేట చర్చ్ వద్ద నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి న్యాయం చేయాలని శాంతి ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా పాస్టర్ రెవరెండ్ ఎన్ జార్జ్‌ముల్లర్ మాట్లాడుతూ దేవుని సేవకుడైన పాస్టర్ ప్రవీణ్ అనుమానిత మరణం యావత్తు క్రైస్తవ లోకాన్ని కలిచివేసిందని అన్నారు. ఎంతో ఉన్నతుడైన ప్రవీణ్ మరణం పట్ల యావత్తు క్రైస్తవలోకం అనుమానం వ్యక్తం చేస్తున్న సమయంలో ఎవరో ఒకరు ఏదో చెప్పి చేతులు దులుపుకోవడం సమంజసం కాదన్నారు. సమాజానికి ఎంతో మంచిచేసే క్రైస్తవ నాయకుడు, ప్రభు బోధకుడు అయిన ప్రవీణ్ మరణంపై పోలీసులు నిజానిజాలు బయటకు తెచ్చి దోషులను కఠినంగా శిక్షించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం శామ్యూల్, ఎం ఫిలిఫ్, జే దివాకర్, వై హనోకు, బీ శేఖర్, జీ జార్జ్,సీహెచ్ యోబు,ఆయా సంఘాల కార్యవర్గ సభ్యులు, సంఘాల పెద్దలు, స్త్రీల సమాజం, యూత్ ప్రతినిధులు, సంఘాల విశ్వాసులు పాల్గొన్నారు.

మినరల్ కాదు.. జనరల్!

- ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న వ్యాపారులు
- అనుమతుల్లేకుండా వెలుస్తున్న ప్లాంట్‌లు
- చోద్యం చూస్తున్న అధికారులు



పాలకోడేరు మండలం శృంగవృక్షంలోని వాటర్ ప్లాంట్ ద్వారా అమ్మకానికి నీటిని పట్టుకెళ్తున్న దృశ్యం



మోగల్లులోని ఐఎస్ఐ అనుమతి లేని వాటర్ ప్లాంట్

పాలకోడేరు: మండలంలోని పరిసర ప్రాంతాలలో మినరల్ వాటర్(శుద్ధజలం) పేరిట నీటి దందా జోరుగా సాగుతోంది. ఆదాయం ఉంటుండటంతో పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు వెలుస్తున్నాయి. ఆదాయమే లక్ష్యంగా పెట్టుకోవడంతో నాణ్యతా ప్రమాణాలు, నిబంధనలకు తూట్లు పొడిచి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారు. ఈ దందాను రెవెన్యూ అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏళ్ల నుంచి వాటర్ ప్లాంట్ వ్యాపారులు దందా చేస్తున్నప్పటికీ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. హోటళ్లు, చిరువ్యాపారులు, మధ్య తరగతి ప్రజలు మినరల్ వాటర్ క్యాన్లు కొనడంతో నీటి వ్యాపారం అధికమైంది. అదే అదునుగా పలువురు వ్యాపారులు ఎక్కడిపడితే వాటర్ ప్లాంట్లు నెలకొల్పుతూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు.

బోరు నుంచే తోడుతున్నారు..

ఇళ్లలో, ఖాళీ స్థలాల్లో బోర్లు వేసి వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ఇంటి బోరుతో వాణిజ్య అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ తెలియనట్లుగా వ్యవహరిస్తున్నారు. నిబంధనల ప్రకారం మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే రూ.15లక్షల నుంచి రూ.25లక్షల వరకు వ్యయంతో వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవు. వీటి పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు ఎవరికీ వారు తమ పరిధి కాదంటూ ప్రేక్షకపాత్ర వహిస్తుండటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.


నీటి శుద్ధి ప్రక్రియ ఇది...

నిబంధనల ప్రకారం నీటిని 12సార్లు శుద్ధి ప్రక్రియ చేయాల్సి ఉంటుంది. ఫిల్టరింగ్, ఎరేషన్, కార్బన్ ఫ్యాక్టరైజేషన్ లాంటి ప్రక్రియలు జరపాలి. తర్వాత నీటిని డబ్బాల్లో నింపే ముందు 48గంటల పాటు పక్కన నిల్వ ఉంచాలి. అనంతరం పరీక్షలు జరపాలి. ఇందుకోసం నాణ్యత పరికరాలతో కూడిన మైక్రోబయలాజికల్ ల్యాబ్ ఉండాలి. కెమిస్ట్‌ను నియమించుకొని ఎప్పటికప్పుడు నీటిని పరీక్షించాల్సి ఉంటుంది. నాణ్యత ప్రమాణాలు పాటించకుండా శుద్ధి చేసిన నీళ్లను తాగితే ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి.

వ్యాపారానికి ఐఎస్ఐ, బీఎస్ఐ లాంటి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించాలి

ఇసుక, కార్బన్, పిల్టరైజేషన్ ప్లాంట్లు తప్పనిసరిగా ఉండాలనే విషయాన్ని గుర్తించాలి. రివర్స్ ఆస్మోసిస్ సిస్టం ద్వారా నీటిలో బ్యాక్టీరియాను నిర్మూలించే వ్యవస్థ ఉందో లేదో తెలుసుకోవాలి. బయలాజికల్, బ్యాక్టీరియా పరీక్షలు జరుపుతున్నారో అడగాలి. ప్యాకింగ్‌పై వివరాలు ముద్రిస్తున్నారో లేదో గమనించాలి. రెండు ల్యాబ్‌లతో పాటు కెమిస్ట్, మైక్రోబయాలాజిస్టు ఉన్నారో లేదో కనుక్కోవాలి.


శుద్ధమైన నీటిని అందించాలి..



వాటర్ ప్లాంట్ యాజమానులు నిబంధనల ప్రకారం నీటిని శుద్ధి చేసి అందించాలి. పంచాయతీ సరఫరా చేసే నీరు బాగుండకపోవడంతో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ జలాలు కొనుక్కుని తాగుతున్నాం. ఈ జలాలు నాణ్యతతో కూడినవని అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించాలి.

బి సుబ్రహ్మణ్యం మోగల్లు

పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి



ప్రతి గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వీటికి ఐఎస్ఐ లాంటి అనుమతి ఉందా లేదా అన్న సందేహాలు కూడా వస్తున్నాయి. మంచి జలాలు అందించే చర్యలు అధికారులు చేపట్టాలి. ఐఎస్ఐ తదితర అనుమతులు ఉన్నాయి. అని బోర్డులు పెట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

గుబ్బల రాజ్‌కుమార్, గొల్లలకోడేరు

వాటర్ ప్లాంట్ నిర్వహణ పంచాయతీలదే

గ్రామాల్లో ప్రైవేట్ వాటర్ ప్లాంట్ల నిర్వహణ పంచాయతీలదే. వారు పంచాయతీల ద్వారానే సంబంధించిన శాఖలనుంచి అనుమతి పొందాల్సి ఉంటుంది. మా బాధ్యత పంచాయితీ సరఫరా చేసే వాటర్ పైనే తప్ప ప్రైవేటు వాటర్ ప్లాంట్లపై ఉండదు. గ్రామాల్లో ప్రైవేట్ మినరల్ వాటర్ ప్లాంట్ జలాలు బాగుండడం లేదని ఫిర్యాదు చేస్తే వాటిని మూయించేసే బాధ్యత పంచాయతీయే తీసుకుంటుంది.

పార్వతి ఎఈ ఆర్‌డబ్ల్యు ఎస్, పాలకోడేరు.

భారత్ లౌకిక రాజ్యం

పెనుగొండ: భారత దేశం అన్ని మతాలకు సమ ప్రాధాన్యం ఇచ్చే లౌకిక రాజ్యమని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నల్లి రాజేష్ అన్నారు. మాల మహానాడు ఆచంట మండల అధ్యక్షుడు రావి నాగరాజు సహకారంతో ములపర్రు మసీదుకు క్లాత్ అందించారు. కార్యక్రమంలోజిల్లా అధ్యక్షుడు గుండే నగేష్‌బాబు జిల్లా ఉపాధ్యక్షుడు సరెళ్ల శ్రీనివాస్, పెనుగొండ మండల అధ్యక్షుడు చికిలే కృష్ణబాబు, ఉపాధ్యక్షుడు రొక్కాల విజయగాంధీ, తండా ఇషాకు రాజుచ కేసరపల్లి నాగేశ్వరరావు, కేసరపల్లి గిరి, అరిగెల పుల్లారావు, చిల్లేసురేష్, బోళ్ల ప్రసాద్, రావి వెంకటేశ్వరరావు, పినిపే జ్యోతిబాబు, నేలపూడి వరద రాజు, నేలపూడి గాంధీ, సుబ్రహ్మణ్యం, మర్రే ఇంద్రకిరణ్, విజయకుమార్ పాల్గొన్నారు.